ప్రజాశక్తి
గురువారం 30 అక్టోబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





'స్ట్రోక్' నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజలు స్ట్రోక్‌కు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అపోలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ న్యూరాలజీ విభాగ అధిపతి డాక్టర్ బింధు మీనన్ సూచించారు. ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం సందర్భంగా అపోలో హాస్పిటల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, న్యూరాలజీ విభాగ అధిపతి డాక్టర్ బింధుమీనన్, న్యూరాలజిస్టులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ రష్మి రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. డాక్టర్ బింధుమీనన్, డాక్టర్ శ్రీరామ్ సతీష్ మాట్లాడుతూ స్ట్రోక్‌లో ప్రధానమైనది బ్రెయిన్ స్ట్రోక్ అని చెప్పారు. బ్రెయిన్ స్ట్రోక్ తో సంభవించే పక్షవాతానికి సంబంధించి ప్రతి నిముషం ఎంతో విలువైందని, ఎంత త్వరగా రోగిని వైద్యుని వద్దకు చేర్చితే అంత వేగంగా పక్షవాతం నుండి బయటపడే అవకాశం ఉందన్నారు. డాక్టర్ బింధుమీనన్ అపోలో హాస్పిటల్ లో సేవలు అందిస్తూనే నిరుపేదల కోసం డాక్టర్ బింధుమీనన్ ఫౌండేషన్ ను స్థాపించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని డాక్టర్ శ్రీరామ్ సతీష్ కొనియాడారు.



'మొంథా' నష్టాలపై సమీక్ష

నివేదికలు సిద్ధం చేయాలి - అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం

ప్రజాశక్తి-నెల్లూరు

భారీ వర్షానంతర పరిస్థితుల్లో వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రాథమిక నివేదికలు తయారు చేయుటలో శ్రద్ధ చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం లో వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ తుఫాన్ అనంతర పరిస్థితిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టిన పరిస్థితుల్లో గ్రామాల్లో పారిశుద్యం పై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలలోని వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షాలకు నానిన పాఠశాలల ప్రహరీ గోడలు, తదితరాల పరిస్థితులను పరిశీలించాలని విద్యా శాఖ అధికారిని ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో కూరగాయలు అమ్మకాలను కొనసాగించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు.రోడ్లు, కల్వర్టు దెబ్బ తిన్న ప్రాంతాలను గుర్తించి నష్టం అంచనాల నివేదికలు సిద్ధం చేయాలన్నారు. డి ఆర్ ఓ విజయ్ కుమార్, డి పి ఓ శ్రీధర్ రెడ్డి, డి టి సి చందర్, డి ఈ ఓ బాలాజీ రావు, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈలు దేశ్ నాయక్, గంగాధర్, విజయ్ భాస్కర్ ఉన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పోలీసుల సేవలు భేష్..
ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి-నెల్లూరు : తుపాన్ కారణంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకున్న ముందస్తు చర్యలను పటిష్టంగా అమలు చేసి రాత్రి 7 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు నేషనల్ హైవే పై వాహనాలను నిలుపుదల చేసి సురక్షితంగా పంపిన పోలీసు సేవలు అభినందనీయమని ఎస్‌పి డాక్టరు అజిత వేజెండ్ల సిబ్బందిన ప్రశంసించారు. బుధవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత జిల్లాల్లోని జాతీయ రహదారులలో ప్రయాణించే భారీ వాహనాలను, తేది.28.10.2025 న రాత్రి 7 గంటల నుండి నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ సిబ్బంది దగదర్తి నుండి కావలి టోల్ ప్లాజా వరకు, వెంకటాచలం, బుచ్చి, డిసి పల్లి టోల్ ప్లాజా తదితర ప్రదేశాలలో వాహనాలను నిలుపుదల చేశారన్నారు.వాహనాలను నిలుపుదల చేసిన అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, రూరల్ డిఎస్‌పి గట్టమనేని శ్రీనివాసరావు , కావలి డిఎస్‌పి శ్రీధర్, కావలి రూరల్, కావలి సర్కిల్, వెంకటాచలం, బుచ్చి, ఆత్మకూరు పోలీస్ అధికారులు సిబ్బందిని పేరు పేరునా అభినందిస్తున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీ కాలువలు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 16వ డివిజన్ ప్రాంతంలోని గుర్రాల మడుగు సంఘం, జగదీష్‌నగర్ ప్రాంతాలల్లో డ్రైనేజీ కాలువలు లేని కారణంగా మురుగు నీరు రహదారులపై నిలిచి దుర్గధభరితమైన వాసనలతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో డ్రైనేజీ కలువల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కమిటీ సభ్యులు కాయంబు శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం 16వ డివిజన్ పరిధిలోని గుర్రాల మడుగు సంఘం, జగదీష్‌నగర్ ప్రాంతాలల్లో సిపిఎం బృందం పర్యటించింది. తుఫాన్ కారణంగా తమ ప్రాంతానికి మంచినీటి సరఫరా సక్రమంగా కావడం లేదని, కరెంటు పోల్స్ పడిపోవడం, విద్యుత్తు తీగలు తెగిపోవడం వల్ల తమ ప్రాంతానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని అధికారులు స్పందించి విద్యుత్తు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యను స్థానిక సిపిఎం నాయకులు విద్యుత్తు సబ్‌స్టేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి మరమ్మత్తులు చేయించి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సిపిఎం నాయకులు జె.సుధాకర్, వెంకటేశ్వర్లు, బాబు,డివైఎఫ్ఐ నగరకమిటీ సభ్యులు తిరుపతి, రాజేష్, సతీష్, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు కర్తీక్, నానీ పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఆర్ శ్రీనివాసులు

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ సరికాదు

ప్రజాశక్తి-కందుకూరు : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం కందుకూరు పట్టణంలోని 26 వ వార్డు లో జరిగింది. కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాలతో కందుకూరు పట్టణం లోని 26వ వార్డు లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 26వ వార్డ్ అధ్యక్షులుగా వడ్లమాని శేఖర్ ను ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ,రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు గణేశం గంగిరెడ్డి,జిల్లా ఇంటలెక్చువల్ అధ్యక్షులు రావులకొల్లు బ్రహ్మానందం, జిల్లా మున్సిపల్ సెక్రెటరీ నగల్ల నారయ్య, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు యారమాల నాగభూషణం, తల్లపనేని గోపి,షేక్ రహీం, కానాల శివప్రసాద్ ఉన్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-కందుకూరు : దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు కందుకూరు పట్టణ కమిటీ సమావేశం జి రమేష్ అధ్యక్షతన బుధవారం జరిగింది. పట్టణ కార్యదర్శి ఎస్‌కె సల్మా మాట్లాడుతూ తుపాన్ సమయంలోనూ కార్మికులు ,ఉద్యోగులు పనిచేస్తున్నారని వారికి రక్షణ పరికరాలు అందించాలన్నారు. నవంబర్ 2న పట్టణంలో సిఐటియు విస్తృత సమావేశం జరుగుతుందన్నారు. నాయకులు శరత్, కేశవ కుమారి ,సుధాకర్, ఎస్సే గౌస్, డి ఎం రాయుడు, డి మహేష్, బి శ్రీనివాసులు పాల్గొన్నారు.

31న 'ఉక్కు మనిషి' జయంతి

ప్రజాశక్తి-నెల్లూరు : ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని అందరి భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించుకుందామని విఎస్‌యు వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. బుధవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో మేర యువ భారత్ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని నగరంలో ఈ నెల 31వ తేదిన, కావలిలో నవంబరు 7వ తేదిన పాదయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : తుపాన్ కారణంగా పనులు కోల్పోయిన వ్యవసాయ కూలీలందరికీ 3000 రూపాయల ప్రభుత్వ సహాయం,25 కిలోల బియ్యం,పరుపు, దిండు అందించాలని, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం వలేటివారిపాలెం,ఉలవపాడు మండలాల సమన్వయ కమిటీ కార్యదర్శి దువ్వూరి జాన్, సిఐటియు వలేటివారిపాలెం మండల కన్వీనర్ సాదు చెన్నకేశవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డ్రైనేజీ కాలువలు లేనందున నలదలపూరు, కొండారెడ్డి పాలెం, సింగమనేనిపల్లి, అయ్యవారిపల్లి, లింగపాలెం, అంక భూపాలపురం లాంటి లోతట్టు గ్రామాల్లోకి నీరు చేరిందన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు
'టిఆర్‌ఆర్' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : ఈ నెల 23న నెల్లూరు డికె డబ్ల్యూ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్‌లో కందుకూరు టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కి చెందిన విద్యార్థులు రెండు విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించి అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవికుమార్ తెలిపారు. నెల్లూరు జిల్లా సెట్ నెల్ వారి ఆధ్వర్యంలో జరిగినకథా రచనలో థర్డ్ బి ఏ ఇంగ్లీష్ లిటరేచర్ విద్యార్థి రావినూతల మహేష్ మొదటి స్థానం సాధించాడని,కవితా రచనలో (పోయెట్రీ రైటింగ్)థర్డ్ బి ఏ ఇంగ్లీష్ లిటరేచర్ విద్యార్థి చదలవాడ జైస్వాల్ మొదటి బహుమతి సాధించాడని తెలిపారు. వీరు త్వరలో అమరా వతిలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా తరపున పాల్గొంటారని ప్రిన్సిపాల్ రవి కుమార్ తెపారు. రెండు విభాగాల్లో బహుమతులు సాధించిన ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్ రవి కుమార్, అధ్యాపకులు అభినందించారు. వారు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.


రావినూతల మహేష్


చదలవాడ జైస్వాల్

'బిపిసిఎల్'లో 'ఆయిల్ ఇండియా'కు వాటా

ప్రజాశక్తి-కందుకూరు : రామాయపట్నం ఓడరేవు వద్ద భారత్ పెట్రోలియం కంపెనీ నిర్మించనున్న చమురుశుద్ధి కర్మాగారం, పెట్రో కెమికల్ కాంప్లెక్సులో ఆయిల్ ఇండియా కంపెనీ వాటా తీసుకోనుంది. రెండు కంపెనీల మధ్య ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లాగే ఆయిల్ ఇండియా లిమిటెడ్ కూడా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. రామాయపట్నం పెట్రోల్ కెమికల్ కాంప్లెక్స్ లో ఆయిల్ ఇండియా కంపెనీ వాటా ఎంత అనేది స్పష్టంగా తెలియలేదు. రెండు కంపెనీల కలిసి లక్ష కోట్ల రూపాయల వ్యయంతో చమురు శుద్ధి కర్మాగారంతో పాటు పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ను నిర్మించనున్నారు. చమ్మది శుద్ధి కర్మాగారం తో పాటు పెట్రోల్ కెమికల్ కాంప్లెక్స్ 2030 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తామని భారత్ పెట్రోలియం కంపెనీ ప్రకటించింది.రామాయపట్నం ఓడరేవు సమీపంలోని చేవూరు, రావూరిలో చమురుశుద్ధి కర్మాగారం తో పాటు పెట్రోల్ కెమికల్ కాంప్లెక్స్ నిర్మించడానికి భారత్ పెట్రోలియం కంపెనీ ఇప్పటికే ముందస్తు పనులు చేపట్టండి. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ లో భాగంగా ఇథలిన్ ఉత్పత్తి కర్మకాలాన్ని ఏర్పాటు చేస్తామని ఆయిల్ ఇండియా కంపెనీతో ఒప్పందం తర్వాత భారత్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది.



జలదిగ్బంధనంలో జనం..!

తగ్గని వాగుల ఉధృతి - నిలిచిన ప్రజల రాకపోకలు


పెద్దపవనికి సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

ప్రజాశక్తి- ఉలవపాడు : మొంథా తుపాన్ ప్రభావంతో నాలుగు రోజులు కుండపోత వర్షం కురిసింది.దీంతో మండలం పరిధిలోని చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో గుంతలు పడ్డాయి. దీంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. మరోవైపు మన్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరు సమీపంలో ఉన్న ఉప్పుటేరు, ఎలుకెరు పొంగి ప్రవహించటంతో గుడ్లూరు నుంచి కావలికి కందుకూరికి వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి బుధవారం సాయంత్రం వరకు వాహన రాకపోకలు ఆగిపోయాయి. గుడ్లూరు కందుకూరు మధ్యన ఉన్న మన్నేరు బ్రిడ్జిపై నాలుగు నుంచి ఐదు అడుగులు కూ పైగా నీటి ప్రవాహం పెరగడంతో వాహన రాకపోకలను నిలిపివేశారు. గుడ్లూరు -మాచవరం మధ్యనున్న మన్నేరు బ్రిడ్జి పై నీటి ప్రవాహం ఉప్పొంగింది. గుడ్లూరు -కావలి ప్రధాన రహదారిలో చెమిడిపాడు దగ్గర ఉన్న ఎలికేరు, పొట్లూరు దగ్గర ఉన్న రాళ్లవాగు పొంగి ప్రవహించడంతో కావాలి నుంచి గుడ్లూరుకు వచ్చే ఆర్‌టిసి బస్సులను నిలిపివేశారు.

సాయం అందజేయాలి

నెల్లూరు: తుపాన్ కారణంగా రోజువారీ పనులు లేకపోవడం వల్ల అనేక మంది ఆర్థికంగా నష్టపోయారని,వారందరికీ ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకోవాలని 5వ డివిజన్ అహ్మద్ నగర్ ప్రాంత సిపిఎం శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నగర పరిధిలోని 5వ డివిజన్ అహ్మద్ నగర్ ప్రాంతంలో స్థానిక సిపిఎం పార్టీ శాఖ సభ్యులు పర్యటించి తుఫాను వరద సహాయక చర్యలు గురించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు నరసింహ, చిరంజీవి, అబ్బన్న, వెంగయ్య, కష్ణ తదితరులు పాల్గొన్నారు.



తుపాన్ బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

స్థానిక 31వ డివిజన్ ప్రాంతంలోని చౌటమిట్ట, కిషోర్‌కాలనీ ప్రాంతాలల్లో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను స్థానిక సిపిఎం శాఖ ఆధ్వర్యంలో రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ పర్యటించారు. బుధవారం నిర్వహించిన పర్యటనలో భాగంగా స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ 31వ డివిజన్ శాఖ కార్యదర్శి బి నాగేశ్వర్ రెడ్డి మాట్లాడారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కే పెంచల నరసయ్య 32 వ డివిజన్ శాఖ కార్యదర్శి ఎస్కే ఖలీల్ సిఐటియు రూరల్ అధ్యక్షులు ఎం సుధాకర్ స్థానిక నాయకులు ముత్యాలు నాగ శేషు గంగాధర్ ఉన్నారు.



పిల్లలకు స్నాక్స్ పంపిణీ

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 30వ డివిజన్ పరిధిలోని వైఎస్ఆర్ నగర్, మల్లయ్య గుంట ప్రాంతాలల్లోని చిన్నారులకు సిపిఎం శాఖ సభ్యులు స్నాక్స్ పంపిణీ చేశారు. బుధవారం ఈ ప్రాంతంలో పర్యటించిన స్థానిక సిపిఎం శాఖ కార్యదర్శి కండె కోటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ఆర్ నగర్ ,మల్లయ్య గుంట ప్రాంతాలలో చిత్తు కాగితాలు, చిక్కు వెంట్రుకలు అమ్ముకొని జీవనం సాగించే కుటుంబాలున్నాయని, తుఫాన్ కారణంగా ఆయా కుటుంబాలు ఇంటికే పరిమితమై పోయారన్నారు. దీని వల్ల ఆ కుటుంబాలకు చెందిన పిల్లలకు స్థానిక సిపిఎం శాఖ ఆధ్వర్యంలో స్నాక్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిపిఎం నాయకులు వాసుదేవరావు, ప్రకాష్ రావు ,మధు, సీనయ్య, రాజేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

తోటపల్లిగూడూరు : తుపాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాలలో చేరిన నిరుపేదలకు టిడిపి నాయకులు ఆహారం అందజేశారు. మండలంలోనివరిగొండ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో టీడీపీ నాయకులు, సొసైటీ మాజీ చైర్మన్ కోడూరు శ్రీనివాసులు రెడ్డి (వరిగొండ చినబాబి రెడ్డి) బుధవారం తుఫాన్ బాధితులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనల మేరకు పునరావాస కేంద్రాలలో ఆహారం అందజేస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు కర్పూరపు శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవళిక, సచివాలయం సిబ్బంది, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొణతం రఘుబాబు, బీజేపీ సీనియర్ నాయకుడు అన్నం శ్రీనివాసులు వీఆర్వో జనార్దన్, యూనిట్ ఇంచార్జి అరికాటి వెంకటేశ్వర్లు, మారంరెడ్డి సమంత్ రెడ్డి పాల్గొన్నారు.




కరేడు ర్యాంప్ వద్ద..

ప్రజాశక్తి - లింగసముద్రం : తుపాన్ ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకు మండలంలో వాగులు పొంగి పొర్లుతున్నాయి. పెద్దపవని సమీపంలో ఉన్న ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిం చడంతో పెద్ద పవనికి రాకపోకలు నిలిచిపోయాయి. కావలి నుంచి లింగసముద్రం, సాయి పేట ఇసుక పాలెం తదితర గ్రామాలకు వచ్చే బస్సులు నిలిచిపోయాయి. ఉప్పుటేరు వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ నారాయణ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద పవని ఫీల్డ్ అసిస్టెంట్ డి మధు ఉప్పుటేరు ఉధతంగా ప్రవహిస్తున్న సమయంలో ఎవరిని దాటనీయకుండా ఆపారు.మేదరమెట్ల పాలెం బస్టాండ్ సమీపంలో ఉన్న వాగు భారీగా నీరు రావడంతో ఉధతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి గ్రామ సర్పంచ్ కూరపాటి మాధవి టిడిపి నాయకులు కూరపాటి శ్రీనివాసులు, గ్రామ టిడిపి అధ్యక్షులు కూరపాటి భాస్కర్ వాగు గ్రామస్తులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

రాళ్లపాడు గేట్లు ఎత్తివేత

తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతం నుండి వరద నీరు ఎక్కువగా రావడంతో ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 14వేల క్యూసెక్కులన్నిటిని మన్నేరుకు విడుదల చేశారు. నీటి ప్రవాహం ఉధతంగా రావడంతో అధికారులు అప్రమత్తంగా ఉండి నీటిని మన్నేరుకు విడుదల చేశారు. నీటి ప్రవాహం తగ్గడంతో రెండు గేట్లు ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడం వల్ల ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. నీటి ప్రవాహం తగ్గడంతో గేట్లను దించామని ప్రాజెక్టు డి ఈ వెంకటేశ్వరరావు చెప్పారు.

'రాళ్లపాడు'ను సందర్శించిన 'ఇంటూరి'


రాళ్లపాడు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో రైతులు ఆనందోత్సవాలతో ఉన్నారని, ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.బుధవారం సాయంత్రం అయినా రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు ప్రాజెక్టు డి ఈ వెంకటేశ్వరరావు వివరాలు తెలిపారు..ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టుకి నీటి ప్రవాహం తగ్గడంతో పూర్తిస్థాయిలో నీటిని నింపాలని అధికారులకు సూచించారు.ప్రాజెక్టుకు నీరు రావడంతో రైతులు వరి సాగు చేసుకునేందుకు సన్నద్ధం కావాలని చెప్పారు సముద్రంలోనే బలిజ పాలెంలో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బంది పడుకున్నారని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కందుకూరు నియోజకవర్గం జనసేన ఐటి కోఆర్డినేటర్ బింకం నరేంద్ర ఎమ్మెల్యే దష్టికి తెచ్చారు.. ఎంపీడీవో శ్రీనివాసులు,టిడిపి మండల అధ్యక్షులు గురునాథం, ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు సోంపల్లి మనోహర్, వీరస్వామి, శేషయ్య,రంగయ్య,కె శ్రీనివాసులు ఉన్నారు.

విజయమ్మకు పరామర్శ

ప్రజాశక్తి -లింగసముద్రం : మండలంలోని విఆర్ కోట గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో తుపాన్ కారణంగా సోమేపల్లి విజయమ్మ రేకులు ఇల్లు భారీ వర్షాలు కారణంగా కూలిపోయింది.అందులో ఉన్న వస్తువులు ఇతర వంట సామానులు దెబ్బతిన్నాయి. ఈ విషయమై తహశీల్దార్ ఎం. కోటేశ్వరరావు సిబ్బందితో బుధవారం పరిశీలించారు. విజయమ్మతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం.రమణయ్య వి.ఆర్ కోట గ్రామ రెవిన్యూ అధికారి పఠాన్ అమానుల్లా ఖాన్, షర్మిల,అంగనవాడి టీచర్ కరణం మమత పంచాయతీ కార్యదర్శి సాయి కిరణ్ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఉలవపాడు : ఉలవపాడు ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన వరదబాధితుల పునరావాస కేంద్రాన్ని బుధవారం సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జి.వి.బి కుమార్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కోటిరెడ్డిగుంట, వరదాయమ్మ కాలనీలు వరద ముంపునకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. ఐటిడిఎ ద్వారా కోటిరెడ్డి కుంట గిరిజనులకు ప్రస్తుతం నివాసంఉంటున్న చోటనే ఎంపిడిఒ ఆఫీస్ పక్కన సమీకత గహ సముదాయాన్ని నిర్మించి వారికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న గిరిజనులు, దళితులందరికీ రూ. 3000 తక్షణ సాయం, పరుపు, దిండు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సిపిఎం నాయకులు కత్తి. తాతయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉలవపాడు మండల సహాయ కార్యదర్శి గొల్ల పోతు శివకుమార్ ఉన్నారు.



లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

నెల్లూరు కార్పొరేషన్: నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక వెంకటేశ్వరపురం ప్రాంతంలోని నదీ పరివాహక లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు. భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీళ్లు చేరిన ముంపు ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. మోటార్ల సహాయంతో నీటిని తోడే పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : భారీ వర్షాలకు మండలంలోని చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. మండలంలోని పోకూరు చెరువు నిండిపోయి అలుగు పారడంతో గ్రామస్తులు చేపలు పట్టుకున్నారు. బడేవారిపాలెం, పోలినేనిపాలెం, శాఖవరం, కలవళ్ళ తదితర గ్రామాలలో సమీప చెరువులు నిండిపోయాయి.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం..!

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలోని మహాదేవపురం వద్ద గల జగనన్న కాలనీలో మొంథా తుపాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు కాలనీ వెళ్లే రోడ్డుపై నీరు ఎక్కువగా ప్రవహిస్తునందు వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని తెలుసుకుని అక్కడకు ట్రాక్టర్ల పై అధికారులు, టిడిపి నాయకులు కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించి వరద బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులకు సూచనలు చేశారు. ఎంఎల్ఎ ఇంటూరి మాట్లాడుతూ అధైర్యపడొద్దని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. . మున్సిపల్ కమిషనర్ కే అనూష, తహసిల్దార్ లావణ్య పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.


వరద బాధితులను పరామర్శించేందుకు ట్రాక్టర్‌లో వెళ్తున్న ఎంఎల్ఎ ఇంటూరి

పునరావాస కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : మొంథా తుపాన్ కారణంగా కందుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న తుఫాన్ పునరావస కేంద్రాలను ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కె అనూష, తహశీల్దార్ లావణ్య, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్నదానం..

తుపాన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారికి అందించే వసతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు ఇచ్చిన పిలుపు మేరకు టిడిపి నాయకులు తల తోటి మస్తాన్ తన సొంత నిధులతో 300 మందికి అన్నదానం చేశారు.

వరదబాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-కావలి:కావలి రూరల్ మండలం, రుద్రకోట పంచాయతీ పరిధిలోని గుమ్మడిబొందల గ్రామంలో తుపాన్ ప్రభావం తో వాగుకు భారీగా నీరు చేరి గ్రామంలోకి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే కావ్యకృష్ణారెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి బుధవారం వాగు వద్దకు చేరుకొని, ట్రాక్టర్ నడుపుకుంటూ వాగు దాటి,బైకు మీద గ్రామంలోకి చేరుకున్నారు. గ్రామ ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు.వరద బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వాగు వద్ద తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.కావలి మండల పరిధిలోని ఆనెమడుగు పంచాయతీ ఆకుతోట గిరిజన కాలనీలో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఇరిగేషన్ అధికారులు,పార్టీ నాయకులుతో కలిసి పర్యటించారు.విస్తారంగా వర్షాలు కురవడంతో సమీపంలో ఉన్న మద్దూరు పాడు టిడ్కో నివాసాల్లోకి నీరు చేరి,ఆ ప్రాంతాలు ప్రజలు ఇబ్బందులు తెలుసుకున్నారు. రాకపోక లకు ఇబ్బంది కలుగు తుండడంతో అధికారులతో నీటిని కట్టలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


బాధితులను పరామర్శించేందుకు ట్రాక్టర్‌లో వెళుతున్న ఎంఎల్ఎ

17అడుగులకు చేరిన నీటిమట్టం

ప్రజాశక్తి-ఉదయగిరి:హగతంలో రెండు అడుగుల ఉన్న పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం 17 అడుగులకు చేరిందని ఇరిగేషన్ డిఇ చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో సీతారాంపురం 25 చెరువులు, ఉదయగిరి 40 చెరువులు ఒక చెంచురామయ్య జలాశయం మొత్తం 66 చెరువులు కలవన్నారు. మొంథా తుపాన్‌తో సబ్ డివిజన్ పరిధిలోని 41 చెరువు నీరు పుష్కలంగా చేరాయని ఐదు చెరువులు మాత్రం 75 శాతం వరద నీరు చేరువైందన్నారు. ఈ జలాశయానికి 3,850 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతుందని రైతాంగానికి ఈ వర్షపు నీరు ఈ సంవత్సరం ఈ ప్రాంత రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్ పాల్గొన్నారు.

తప్పిన తుపాన్ ప్రమాదం

ప్రజాశక్తి-ఉదయగిరి:ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన మొంథా తుపాన్ ప్రమాదం తప్పిపోయిందని వైసిపి ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పట్టణంలోని తుపాను ప్రభావిత ప్రాంతాలైనా దుర్గం, ఆనకట్ట పలు ప్రాంతా ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన మొంథా తుపాన్ ప్రజలను ఎటువంటి ఇబ్బంది పెట్టలేదని మన ప్రాంత రైతులకు ప్రజలకు ఈ ఏడాది కురిసిన వర్షం చాలా ఆశాజనకంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా యువత విద్యార్థులు నిండిన చెరువులు వాగులు, కుంటల వద్దకు వెళ్లొద్దని జాగ్రత్తలు పాటిస్తూ గ్రామాలలో ఇంటి వద్ద సంతోష ంగా గడపాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ ఆలీ అహ్మద్, మండల కన్వీనర్ కొండ రాజగోపాల్ రెడ్డి, మాజీ సాహిత్య అకాడమీ చైర్మన్ అక్కి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదానికి దగ్గరలో ఊటుకూరు

ప్రజాశక్తి-వింజమూరు:మండలంలో తుపాను ప్రభావంతో దాదాపుగా 17 చెరువులకు పూర్తిగా నీరు రావడంతో నిండి అలుగులు బారీ స్థాయికి వచ్చాయి. ఇందులో భాగంగానే ఊటుకూరు, జువ్వలగుంట పాలెం చెరువులు పూర్తిగా నిండి ప్రమాద స్థాయికి చేరుతున్నాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగానే మండలంలోని చెరువులన్నీ పరిశీలనలో భాగంగా మండలం మొత్తం మీద 31 చెరువు గాను 17 చెరువుల పూర్తిగా నిండాయని 12 చెరువులు లకు 75శాతం నీరు చేరినట్లు మరో రెండు చెరువులకు 20 శాతం నీరు చేరినట్లు ఇరిగేషన్ డి ఈ రమణారావు తెలిపారు. పూర్తిగా నిన్న చెరువులకు చిన్నపాటి గండి పడటం వల్ల వాటిని యుద్ధ ప్రాతిపదిక పైన చెరువు కట్టలకు మరమ్మతులు చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ మహేంద్ర శ్రీనివాసరావు, మండల కన్వీనర్ గూడ నర్సారెడ్డి, ఇరిగేషన్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నక్కల వాగు బ్రిడ్జిని పరిశీలించండి సారూ..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:మండలంలోని ఏ ఎస్ పేట గ్రామ సమీపంలో గల నక్కల వాగు బ్రిడ్జిపై చిన్నపాటి వానొచ్చిన, తుపాను వచ్చిన నీళ్లు బ్రిడ్జిపై పారుతూ, మండల ప్రజలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈనెల 24వ తేదీ వచ్చిన వాన వల్ల ఒకసారి, మంగళ వారం నుంచి మొంథా తుపాన్ ప్రభావం వల్ల రాకపోకలకు, తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. మూడు రోజులకు ఒకసారి వర్ష ప్రభావం వల్ల ఆర్టీసీ సర్వీసులు పూర్తిగా నిలిపివేయడం పరిపాటిగా మారింది. జమ్మువరం గ్రామానికి సంబంధించిన మజారా గ్రామమైన కాకర్లపాడు వారు వేరే ప్రాంతానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో వారి స్వగ్రామానికి వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య నుంచి పరిష్కారం చూపాలని ఆత్మకూరు నియోజకవర్గ మంత్రికి పత్రిక ముఖంగా వేడుకుం టున్నారు.

నీటిలో టిడ్కో అపార్ట్‌మెంట్ ఇళ్లు

ప్రజాశక్తి-కావలిమొంథా తుపాను వలన భారీవర్షాలు కురవడంతో పట్టణంలోని టిడ్కో ఇళ్ల చుట్టూ నీళ్లు చేరడంతో అక్కడ ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈవిషయాన్ని తెలుసుకున్నందుకు బుధవారం సిపిఎం నాయకులు అక్కడ పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఇళ్ల చుట్టూ నీళ్లు చేరడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇళ్ల నుంచి రోడ్లలో నడవలేని పరిస్థితి ఉన్నారు. ఇళ్లలోనే ఉన్నం దున జనజీవన పరిస్థితుల్లో కూడా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికీ సుమారు వారం రోజుల నుండి వర్షాలు కురుస్తున్నందున పనులు లేక ఇబ్బం దులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే సహాయాన్ని అందించి ఆదుకోవాలని వర్షపు నీళ్లు బయటకు వెళ్లేందుకు తగు చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణకార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు వై.కృష్ణమోహన్, భోగిశెట్టి కృష్ణయ్య, కె.చెన్నయ్య, స్థానిక నాయకులు ఎస్‌కె ఖాదర్ బాషా పాల్గొన్నారు.


అపార్ట్‌మెంటు వద్దకు వరదనీటిలో వెళుతున్న నాయకులు

పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-కావలి: ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు మొంథా తుపాను వలన ఇబ్బందులు పడుతున్న పేదలకు ప్రభుత్వం 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, బట్టలు సహాయాన్ని అందించి పేదలను ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుంది. వర్షాల వలన ఇబ్బందులు పడుతున్న పలు కాలనీలను ఈరోజు సిపిఎం నాయకులు సందర్శించారు. పెంకుల ఫ్యాక్టరీ చెరువు సంఘం, బుడమగుంట గిరిజన కాలనీ ఇంకా మరికొన్ని కాలనీలను సందర్శించారు. వర్షాల వలన పనులు చేసుకొని ఏరోజుకారోజు పూట గడుపుకునే పేదలు ఈ వర్షాల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,రోడ్లలో పూరిల్లు ఉరిసి, రేకులల్లు కూడా ఉరిసి రోడ్లలో కూడా నీరు నిలిచి పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసుకునేందుకు పనులు లేక పూట గడవని పరిస్థితుల్లో ఉన్నారని, ఇలాంటి పేదలకు ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి 50 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులు బట్టలతో పాటు సహాయాన్ని అందించి పేదలందరినీ ఆదుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి. పెంచలయ్య, బోగిశెట్టి కష్ణయ్య, వై.కష్ణమోహన్, కే. చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరింత మెరుగైన సేవలు

ప్రజాశక్తి-కోవూరు: సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీసీహెచ్ఎస్ ఏకే పరిమళ ఆకస్మికంగా పరిశీలన చేపట్టారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వార్డులోని మహిళా రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో వైద్యసేవలు ఎలా ఉన్నాయి.. సకాలంలో అందుతున్నాయా లేదా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే ఇన్పెషెంట్ల జాబితాను మరింత పెంచాలన్నారు. అదేవిధంగా ఆస్పత్రిలో చేస్తున్న వైద్యసేవలపై వచ్చే రోగులకు మరింత నమ్మకం కల్పించేలా ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఆస్పత్రి వరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ల్యాబ్లో చేస్తున్న పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ లీలావతికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సలావుద్దీన్, హెడ్ నర్సు ప్రసూనలత, ఫార్మాసిస్ట్ నరసింహులు, తదితరులున్నారు.

జలదిగ్బంధనంలో జలదంకి

ప్రజాశక్తి-జలదంకి

వర్షాలు తగ్గుముఖం పట్టిన మండలంలోని పలు గ్రామాలు ఇంకా జలధిగ్బంధంలోనే ఉన్నాయి. ముంథా తుపాన్ అంతర్వేదిలో తీరం దాటిన తర్వాత బుధవారం తెల్లవారు జాము నుండి మండలంలో వర్షం ఆగిపోయింది. తుపాన్ ప్రభావం వల్ల కురిసిన వర్షాల వల్ల చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి.వరద తీవ్రత ఇంకా తగ్గలేదు. పల్లెల్లోని రోడ్లు సైతం వాగులను తలపిస్తున్నాయి . బ్రాహ్మణ క్రాక పంచాయతీలోని గన్నవరం గుంట చుట్టూ నీరు చేరింది. ఈ గ్రామం ద్వీపాన్ని తలపిస్తుంది. ఈ గ్రామం నుండి ఎటు చూసినా చుట్టూ వరద నీరు కనుచూపుమేర కనిపిస్తుంది. విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జలదంకి తిమ్మసముద్రం రోడ్డు మార్గంలో జలదంకి అలుగు పారడం వల్ల టెంకం వారి పాలెం చాప్టా వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలోని గోపన పాలెం వద్ద గల ఊళ్ళ వాగు, అన్నవరం గట్టుపల్లి పొలిమేరలో గట్టుపల్లి అలుగు ఉదతకు కప్పల వాగు, దాసరి అగ్రహారం వద్ద అన్నవరం పెద్దవాగు నదులను తలపించేలా ప్రవహిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలోని గ్రామా లకు రాకపోకలు పూర్తిగా నిలిపి వేశారు. చామదల వద్ద నేరెళ్ల వాగు, 9వ మైలు గుడ్లదొన మార్గంలోని సోమరపాడు వద్ద సోమవరపాడు అలుగు ఉదతకి ఈ మార్గంలో రాకపోకలు స్తంభిం చాయి. మండలంలోని 17 పంచాయ తీలలో కావలి ఉదయగిరి రోడ్డు మార్గంలోని జమ్మలపాలెం, జలదంకి, 9వ మైలు, బ్రాహ్మణక్రాక అగ్రహారం, అనుమకొండ పాలెం, చిన్న క్రాక, కోదండ రామాపురం, కావలి కొండాపురం మార్గంలోని రామవరపాడు, చోడవరం గ్రామాల మినహా మిగిలిన గ్రామాలన్నీ జలదిగ్బంధనంలోని చిక్కుకున్నాయి. వరద ఉధతి తగ్గితే తప్ప ఈ గ్రామాల ప్రజలు బయట ప్రపంచానికి రాలేని దుస్థితి నెలకొంది. మండలంలో వరద ఉధత అధికంగా ఉండడంతో రోడ్డు మార్గంలోని చాప్టాల వద్ద జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలు రాకపోకలు సాగించకుండా నిలుపుదల చేశారు. మండలంలోని ముఖ్యమైన రోడ్డు మార్గలలో చాప్టాల స్థానంలో వంతెన నిర్మాణాలులు లేకపోవడం వల్ల ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన చెందు తున్నారు.గట్టుపల్లి చెరువు అలుగు పారుతుం డడంతో ఉదయగిరి నియోజకవర్గంలోని రైతాంగం తోపాటు, కావలి నియోజకవర్గం కావాలి పట్టణానికి ఉత్తరం వైపు ఉండే గ్రామ రైతన్నలంత హర్షం వ్యక్తం చేస్తున్నారు. గట్టుపల్లి చెరువు కలుజు పారితేనే కావలి నుండి ఉదయగిరి వరకు సమద్ధిగా పంటలు పండుతాయానె నానుడి ఈ ప్రాంతం రైతంగంలో నెలకొంది.


వరదనీరు చేరిన దృశ్యం

ఫార్మసీ కాలేజీ ప్రారంభం


మాట్లాడుతున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసులు

ప్రజాశక్తి-కావలి:స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీ పీజీ కాలేజీ ప్రాంగణంలో ఫార్మసీ కళాశాలను నూతనంగా ప్రారంభిస్తున్నట్లు నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పీ.జీ. కళాశాలలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " వి ఎస్ యూ కాలేజీ అఫ్ ఫార్మాస్యుటికల్స్ అండ్ సెన్సస్" పేరుతో ఏర్పడే కళాశాలలో 606 సీట్లు ఉన్నాయన్నారు. అందులో 61 సీట్లలో చెరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రతి విద్యార్థీ ఫీజుకి ప్రభుత్వం ఇచ్చే రీయింబర్స్ మెంట్ సరి పోతుందన్నారు.హాస్టల్ కి కూడా విద్యార్థులకు వచ్చే స్కాలర్ షిప్ సరిపోతుందన్నారు. తమ యూనివర్సిటీలో విద్యను అభ్యసించిన వారు ఉద్యోగాలలో చేరే వారుగాక ఉద్యోగాలు ఇంకొకరికి ఇచ్చే వాళ్ళుగా ఉండే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఏ నైపుణ్యాలు అవసరమో వాటిని కల్పిస్తున్నామని చెప్పారు. యూని వర్సిటీ రిజిస్ట్రార్ కే సునీత మాట్లాడుతూ 66 సీట్లతో ప్రారంభిస్తున్న ఈ కళాశాలలో అన్ని సీట్లు భర్తీ అయితే రానున్న సంవత్సరానికి సీట్ల సంఖ్యను పెంచుకునే అవకాశం ఉందన్నారు. చుట్టుపక్కల ఫార్మసీ కళాశాలలు లేవు కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్చేందుకు గల అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కళాశాలలో ఇప్పటికే హాస్టల్ సౌకర్యం లేడీస్ హాస్టల్ సౌకర్యం మూడు ల్యాబ్లు ఒక క్లాసు రూమ్ ఒక కంప్యూటర్ ల్యాబ్‌ను తయారు చేశామన్నారు ఒక ప్రిన్సిపల్ ని,ముగ్గురు సిబ్బందిని, ఒక ల్యాబ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేసేందుకు గురువారమే ఇంటర్వ్యూలు చేసి నియమిస్తామన్నారు. సమీప ప్రాంతాల విద్యార్థులు ఈ ఫార్మసీ కళాశాలలో చేరి ఉన్న అవకాశాన్ని వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీజీ కళాశాల ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఎన్.వి.రమణా రెడ్డి, నెల్లూరు వి ఎస్‌యు పీజీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్. విజయ, కావలి పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ .చిలుమూరు శ్రీనివాసరావు వి.ఎస్. యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్, అకడ మిక్ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొ.హనుమా రెడ్డి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-విడవలూరు: ముంపు గ్రామ వాసులను సురక్షిత ప్రాతాలకు తరలించడం వల్ల ప్రాణ నష్టం నివారించగలిగామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. మండలంలోని పార్లపల్లి గ్రామంలో ఎస్టీ కాలనీలో తుపాను ధాటికి కూలిపోయిన ఇళ్లను ఆమె పరిశీలించారు. 44 కుటుంబాలకు చెందిన 100 మందికి పైగా గిరిజనులు ఆశ్రయం పొందుతున్న పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ముంపుకు గురయ్యే అవకాశం వున్న గిరిజన కాలనీ వాసులను అధికారులు ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా తరలించడంతో ప్రాణ నష్టం తప్పిందన్నారు. పరస్పర సమన్వయంతో పని చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టిన అధికారులు నాయకులను ఆమె అభినందించారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

దెబ్బతిన్న పంటలు పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు:మండలంలో మెంథా తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను జిల్లా ఉద్యాన వనశాఖాదికారి ఎం వి సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ తిరిపాలు పరిశీలించారు. బుధవారం వారు చుంచులూరు, పడమటి నాయుడుపల్లి, పొంగూరు గ్రామాలలో మిరప, బొప్పాయి పంటలను పరిశీలించారు. జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ మిరప , బొప్పాయి పంటలను పరిశీలించి నీరు ఉన్న దగ్గర నీళ్ళు తీసివేయాలని, కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా రిడోమిల్ గోల్డ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలుపుకొని స్ప్రే లేదా మొదళ్ళు దగ్గర పోసుకొని కుళ్ళు తెగులు నివారించుకోవాలన్నా రు. శాస్త్రవేత్త డా. తిరుపాలు మాట్లాడుతూ మొక్కలు బలం కోసం 13.0.45 , 5 గ్రాములు లీటర్ నీటికి స్ప్రే కలుపుకొని స్ప్రే చేసుకోవాలని చెప్పారు.అదే విధముగా వైరస్ నివారణ కోసం పసుపు, బులుగు అట్టలు ఎకరాకు 30 పెట్టుకోవాలని తెలియజేశారు. వారి వెంట ఉద్యాన అధికారి సి హెచ్ రాజశేఖర్, వి హెచ్ ఎ ఎస్, వి ఏఏ లు, రైతులు ఉన్నారు.


పంటను పరిశీలిస్తున్న అధికారి

మురుగు నీరు తొలగించండి

ప్రజాశక్తి-అనంతసాగరం:మండలంలోని సోమశిల లో గౌతమ బుద్ధా నగర్ కాలనీ లో సిమెంట్ రోడ్డు తగ్గుగా వేయడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. దాంతో మురుగు వాసన, దోమలు విపరీతంగా వాలీ విషజ్వరాలు ప్రబలుతున్నాయి.చిన్న తేలిక పాటి వర్షానికి నీరు నిలుస్తున్నాయని పంచాయతీ అధికారులకు పలు మార్లు విన్నవించిన పరిష్కరించక పోవడంతో పీజీఆర్ఎస్ లో కంప్లైంట్ చేశారు. పంచాయతీ నిధులు ఉన్నా తరువాత చేస్తామని పంచాయతీ అధికారులు చెప్పారు.నేటికి కార్య రూపం దాల్చలేదు. అధికారులు స్పందించి నీరు నిల్వలేకుండా రోడ్డు పక్కన పైప్ లైన్ వేసి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరారు.

వరి పంట పరిశీలన

ప్రజాశక్తి-అనంతసాగరం:మండలంలో ని ఉప్పలపాడు, పాతాళపల్లి, ముస్తాపురం గ్రామాలలోతుపాన్ కు దెబ్బతిన్న వరి పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారిణి పి.సత్యవాణి పరిశీలించారు. పంట పొలాలు భారీ వర్షాల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంటలు నష్టపోయిన ప్రతి రైతూ వారి పంట పొలాన్ని ఎన్యూమరేషన్ టీమ్ కి చూపించి తగిన డాక్యుమెంట్స్ అందించాలన్నా రు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీరావు, మండల వ్యవసాయ అధికారిణి. శైలజకుమారి వ్యవసాయ విస్తరణ అధికారిణి కృష్ణవేణి, గ్రామవ్యవసాయ సహాయకులు వెంకటసుబ్బయ్య, పెంచలయ్య, జ్యోత్స్న రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-అనంతసాగరంస్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను మలేరియా జిల్లా అధికారిణి హుస్సేనమ్మ తనిఖీ చేశారు. లేబరేటరీని పరిశీలించారు.తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా దోమల వ్యాప్తి పెరుగుతుందని ప్రజలని అప్రమత్తంగా ఉండే విధంగా ఇంటింటి ఫీవర్, లార్వా సర్వేలు చేపట్టాలని, అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహించేందుకు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి డాక్టర్ శ్రావణి లు ప్రణాళికలు చేపట్టాలని కోరారు

పెన్నానది పరిశీలన

ప్రజాశక్తి-సంగం:సంగం పెన్నానదిని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్‌పి అజితా వేజెండ్ల సందర్శించారు.వరద ప్రవాహానికి కొట్టుకొచ్చిన బోట్లను వారు పరిశీలించారు.బోట్లు కొట్టుకొచ్చిన తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.బోట్లను బయటకు తీసే చర్యలపై చర్చించారు.ఒక బోటును స్టార్ట్ చేసి బయటకు తరలించారు. ఆనకట్ట పై ఇరుక్కున్న పెద్ద బోటుతో పాటు ,మరో బోటును ఎలా బయటకు తీయాలి అని తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పెన్నానది వద్దకు చేరుకున్నాయి.వారి వెంట ఆర్‌డిఒ పావని, డిఎస్‌పి వేణుగోపాల్, సిఐ వేమారెడ్డి, తహశీల్దార్ సోమ్లా నాయక్, ఎస్ఐ రాజేష్ తదితరులున్నారు.

విద్యుత్ అలంకరణతో ఆలయం

ప్రజాశక్తి-కోవూరు:కోవూరులోని గాంధీ పార్కు సెంటర్లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవ స్థానంలో ప్రథమ కోటి సోమ వారం పర్వదినాన్ని పురస్కరించుకుని గురు వారం స్వామివారికి మహన్యాస పూరక ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సు బ్బరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

భోజన ఏర్పాట్లు

ప్రజాశక్తి-ముత్తుకూరు: పైనంపురం పునరావాసం కేంద్రంలో చిన్న సంఘం గిరిజన కుటుంబాలకు ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ రెండు రోజుల పాటు మూడు పూటలా రుచికరమైన భోజనం సదుపాయాన్ని కల్పించినట్లు ప్రాజెక్ట్ అధికారులు బుధవారం తెలిపారు. ప్రభుత్వ అధికారులు, పంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి చేయడంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు..

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: మండలంలోని పందిపాడు గ్రామంలోని ఎస్‌సి కాలనీలో మొంథా తుపాన్ వల్ల చెరువు నిండడంతో గత మూడు నాలుగు రోజుల నుంచి అలుగు పాడడంతో ఏఎస్పేటకు రావాలంటే నానా అవస్థలు పడుతున్నారు. అక్కడ ఉన్న కాలనీవాసులు పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల పట్ల చొరవ చూపాలని, వర్షాకాలం పేటకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెళ్లాలంటే చాలా ఇబ్బంది అవుతుందని తెలియజేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, మంత్రి పరిశీలించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కావలిమొంథా తుపాన్ బాధితు లను వెంటనే ఆదుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు.బుధవారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ జిల్లాలో తుపాన్ కు గురైౖ తీర ప్రాంత గ్రామాల లోని యానాది కాలనీలో తదితర కాలనీలు కొన్ని దళిత వాడలు వారం నుండి ఇల్లు నీట మునిగి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఆహారం లేక ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. కొన్ని కాలనీలు నీట మునిగి రాలేని పరిస్థితులలో వారు ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజా ప్రతినిధులు పట్టించు కోకపో వడం ఎన్నికల అప్పుడు బడుగు వర్గాలు గుర్తుఉండటం జరుగుతుందని తెలియజేశారు.బోగోలు మండలం, రామస్వామి పాలెం యానాది కాలనీ, అంబేద్కర్ నగర్ కొండ బిట్రగుంట యానాది కాలనీ, అల్లూరులోని వుడ్ హౌస్ పేట,ఇస్తపల్లి దళితవాడ,బిఎంఆర్ యానాది కాలనీ, ఇందుకూరుపేట కాలనీలో మరియు కావలి మండల తీర ప్రాంత యానాది కాలనీలో నీటమునిగి ఆహారం తయారు చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలియజేశారు. 15 రోజుల నుండి వర్షం ఆగకుండా పడుతుందని తెలియజేశారు. ప్రజా ప్రతి నిధులు నష్టపరిహారం అంచనా వేసి ప్రతి కుటుం బానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, పదివేల రూపాయల డబ్బులు ఇవ్వాలని తెలియజేశారు.నీరు పోయేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యానాది సంఘం జిల్లా అధ్యక్షులు బాపట్లసత్యవతమ్మ ,వాసు, పోట్లూరు దీప్తి,తదితరులు పాల్గొన్నారు.

453 మంది బాధితులకు పునరావాసం

ప్రజాశక్తి-ముత్తుకూరు: మొంథా తుపాను సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన పునరావాసం కేంద్రాల్లో 453 మంది బాధితులకు ఆశ్రయం కల్పించినట్లు తహశీల్దార్ స్వప్న అన్నారు. ఈ కేంద్రంలో ఆశ్రయం పొందిన బాధిత కుటుంబాలు బుధవారం తమ నివాస గృహాలకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందించే ప్రక్రియలో బాధితుల వివరాలను తహశీల్దార్ అంతరాలంలో నమోదు చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా సమాచారం సేకరించుకుని ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం బాధితులకు ఆర్థిక సాయంతో పాటు ఒక్కొక్కరికి 25 కిలోలు రేషన్ బియ్యం ఇస్తుందని తెలిపాం



గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :మండలంలోని వెన్నవాడ గ్రామ ఎస్టీ కుటుం బాలకు జనసేన పార్టీ ఆత్మకూరు నియోజక వర్గం పసుపులేటి శ్రీరామ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు శ్రీ చదలవాడ హరీష్, మదుల సహకారంతో కూరగాయలు, దుప్పట్లు పంపిణీ చేశారు. దీనికి సహకరించిన చదలవాడ హరీష్, పసుపులేటి శ్రీరామ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

'మునగాల' చేయూత

ప్రజాశక్తి-జలదంకి:చామదల గ్రామ టిడిపి నాయకులు మునగాల వెంకటేశ్వర్లు రెడ్డి సహకారంతో ఆ గ్రామ హరిజన వాడకు ఊరట లభించింది. ఎడతెరిపి లేని వర్షాల వల్ల మండలం లోని వాగులు వంకలు పొంగిపొర్లు తున్నాయి. దీంతో చామదుల హరిజనవాడలోని నివాసాల్లోకి వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న మునగాల వెంకటేశ్వర్లు రెడ్డి , మండల తెలుగు యువత నాయకులు మునగాల తిరుమలరెడ్డి ద్వారా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు జెసిబి ని ఏర్పాటు చేసి హరిజనవాడలోని నీరు బయటకు వెళ్ళేందుకు కాలువను ఏర్పాటు చేశారు.



అబూబకర్ మృతి ఆవాజ్‌కు తీరనిలోటు

ప్రజాశక్తి-కోవూరు:ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అబూబకర్ అకాల మరణం ఆవాజ్‌కు తీరని లోటని మండల కార్యదర్శి ఎస్‌కె చాన్‌బాషా తెలిపారు. బుధవారం ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జక్కా వెంకయ్య భవనంలో ఆయన చిత్రప టానికి ఎస్‌కె అఫ్రోజ్, రాజశేఖర్‌లు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా చాన్‌బాషా మాట్లాడుతూ అబూబకర్ మైనార్టీ పేద ప్రజల కోసం పనిచేశావారని కొని యాడారు. ఆయన ఎన్నోఆవాజ్ కమిటీలు పెట్టారని, నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు మైనారిటీ అభివృద్ధి కోసం పని చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, అతని కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌కె బాబు, నజీర్, బాబు మేస్త్రీ, షఫీ, ఎజ్డానీ, సందానీ, పాతిమా, తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

వేగూరు కాలువలో మృతదేహం

ప్రజాశక్తి-కోవూరు :మండల పరిధిలోని లక్ష్మీనారాయణపురం పక్కన ఉన్న వేగురు కాలువలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. కాలువ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీ సులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.